క్లుప్తంగా

వేంద్ర, పెద్దాడ గ్రామాల్లో పోలీసుల కవాతు



వేంద్రలో కవాతు నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

పెదపూడి: మండలంలోని వేంద్ర, పెద్దాడ గ్రామాల్లో స్థానిక ఎస్ఐ శోభన్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం కేంద్ర పోలీసు బలగాల కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శోభన్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతవరణంలో సజావుగా నిర్వహించడానికి వివిధ పార్టీల నాయకులు, ప్రజలు సహకరించాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున దానికి అనుగుణంగా అందరు పని చేయాలని కోరారు. ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవచ్చని ఓటర్లలో ధైర్యాన్ని నింపడం కోసం ఈ కవాతు చేస్తున్నామన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి

ముగ్గళ్ల ఎన్నికల ప్రచారంలో ఎంపీపీ జ్యోత్స్న



ముగ్గళ్ళలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సీతానగరం: వైఎస్సార్ సీపీకే తమ ఓట్లు అని ప్రజలు బాహాటంగా చెబుతున్నారని జగనన్నే మళ్లీ రాష్ట్ర ముఖ్యమంత్రి అధికారం చేపడతారని ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అన్నారు. సోమవారం ముగ్గళ్ళలో పార్టీ నాయకులు ఆళ్ల కోటేశ్వరరావు, సాధె చంటిబాబు తదితరులతో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థ/ గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యే అభ్యర్థి జక్కంపూడి రాజాను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీపీ జ్యోత్స్నమాట్లాడుతూ ప్రతి ఇంటి వద్ద అనూహ్యమైన స్పందన వస్తోందని, వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమన్నారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు వాగ్దానాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు. ఈ కార్యక్రమంలో రుద్రం వీరేంద్ర, కోనే కోటేశ్వరరావు, కూచిపూడి ప్రభాకరరావు, మన్నెం నాని, కానూరి రామారావు, బొమ్ముల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

శీతలపానీయాల అందజేత

మధురపూడి: కోరుకొండలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు సోమవారం శీతలపానీయాలు అందజేశారు. మండుటెండలో కూలీలకు ఉపశమనం కోసం వైఎస్సార్ సీపీ నాయకులు అందించారు.

టెన్నిస్ శిక్షణ శిబిరం ప్రారంభం

ప్రకాశం నగర్ : ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నుంచి స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఉచిత టెన్నిస్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్నట్టు సంఘం అధ్యక్షుడు ముళ్ల మాధవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఆరు గంటలకు ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఈ శిక్షణ శిబిరం ప్రాంభోత్సవ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.కె.రామచంద్ర ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.

ఘనంగా గొల్లాలమ్మ జాతర

కె.గంగవరం: మండలంలోని అముజూరు గ్రామ దేవత గొల్లాలమ్మ జాతర మహోత్సవాలను సోమవారం ఆలయ కమిటీ, గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. జాతర సందర్భంగా గ్రామంలో బుట్టబొమ్మలు, కేరళ బాజాలు, కోయడ్యాన్సులు, గరగ నృత్యాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. జాతర సందర్భంగా ఆలయంలోని అమ్మవారితో పాటు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల కోలాహలం



పంచారామ క్షేత్రంలోని స్వామి వారు

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తులు కిటకిటలాడారు. స్వామివారికి ప్రీతైన సోమవారం రోజు కావడం, విద్యార్థులకు వేసవి సెలవులు కావడంతో ఉదయం నుంచీ భక్తులు ఆలయానికి తరలివచ్చి, స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకున్నారు. తెల్లవారుజామున స్వామివారికి పిఠాపురం మహారాజా గోత్రనామాలతో తొలి పూజ, తొలి అభిషేకాలను నిర్వహించారు. ఈఓ నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, చెరుకూరి రాంబాబు, సన్నిధిరాజు వెంకన్న మూలవిరాట్, ఉప ఆలయాల్లోని స్వామివారికి, అమ్మవార్లకు పూజలు చేశారు.

ఊరూరా ఎన్నికల ప్రచారం

- ప్రచారానికి ఐదు రోజులే వ్యవధి
- దూసుకుపోతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో అనపర్తి నియోజకవర్గంలో వార్ వన్ సైడ్ కానుందా? నియోజకవర్గంలో ఏ నోట విన్నా ఇదే చర్చ జరుగుతోంది. అదే ఉత్సాహంతో వైఎస్సార్ సీపీ శ్రేణులు ప్రచారంలో దూసుకుపోతున్నాయి. శాసనసభ ఎన్నికలకు గడువు దగ్గర పడుతుండడంతో పార్టీల ప్రచారాలు ఊపందుకున్నాయి. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ఎత్తుకు పైఎత్తులు వేస్తూ, వ్యూహ రచనతో ముందుకు సాగుతున్నారు. ఎన్నికల ప్రచారానికి కేవలం ఐదు రోజుల వ్యవధి మాత్రమే ఉండడంతో అభ్యర్థులు తమ ప్రచారానికి పదునుపెట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల లబ్ధి కారణంగా వైఎస్సార్ సీపీకి ఊరూరా ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తుంది. ప్రభుత్వంపై ఉన్న అభిమానంతో మహిళలు ఇంటింటికీ వెళ్లి ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు. మరోవైపు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి అండగా అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో ఆటోలు, ప్రచార రథాలు, ద్విచక్రవాహనాలపై తిరుగుతూ రోజూ 7 గంటల నుంచి రాత్రి వరకూ ప్రచారం సాగిస్తున్నారు.

జోరుగా డిజిటల్ ప్రచారం

ఈసారి ప్రధాన రాజకీయా పార్టీలన్నీ డిజిటల్ ప్రచారానికి పెద్దపీట వేస్తున్నాయి. తమ నేతల ఫొటోలు, వీడియోలతో సామాజిక మాధ్యమాల్లో ప్రచారం సాగిస్తున్నాయి. మరోవైపు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి చేసిన అభివృద్ధిని వివరిస్తూ ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసిన వాహనాలను గ్రామాల్లో, ప్రధాన వీధుల్లోకి పంపించి ప్రచారం చేస్తున్నారు. అదేవిధంగా రాజకీయ పార్టీ రంగులతో కూడిన టోపీలు, పార్టీ చిహ్నాలు కలిగిన స్టికర్లు, విభిన్న రూపాలతో వినూత్నంగా ప్రచారాన్ని సాగిస్తున్నారు.

ప్రధాన పార్టీల మధ్యే పోరు

నియోజకవర్గంలో 9 మంది అభ్యర్థులు బరిలో ఉన్నా ప్రధానంగా వైఎస్సార్ సీపీ, బీజేపీలకు చెందిన అభ్యర్థుల మధ్య పోటీ నెలకొంది. వైఎస్సార్ సీపీ తరఫున ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, బీజేపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిలు ఎన్నికల బరిలో నిలిచారు. 2019లో జరిగిన ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించిన డాక్టర్ సూర్యనారాయణరెడ్డి ఈసారి ఎన్నికల్లో అంతకు మించిన మెజార్టీ లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతున్నారు. గడిచిన ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, పారదర్శక పాలన, అభివృద్ధి కార్యక్రమాలను ప్రధాన అస్త్రాలుగా చేసుకుని ప్రచారం సాగిస్తున్నారు. దీనికి తోడు సౌమ్యుడిగా పేరొందిన డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి ప్రజల్లో విశ్వాసం, అవినీతి రహిత పాలన, నిరంతరం ప్రజల్లో ఉండడం కలిసొచ్చే అంశాలుగా కనిపిస్తున్నాయి. మరోవైపు ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి సైతం ఊరూరా తిరుగుతూ ప్రజలతో మమేకమై ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై నమ్మకం, వైఎస్సార్‌సీపీపై ప్రజాదరణే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అఖండ మెజార్టీని అందిస్తుందని, బీజేపీ తరఫున బరిలో నిలిచిన నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి ఎదురుగాలి తప్పదని వైఎస్సార్ సీపీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

ఎన్నికల నిర్వహణలో పీఓ, ఏపీఓల పాత్రే కీలకం



పీఓ, ఏపీఓలకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

రాజానగరం: ఎన్నికలను ప్రశాతంగా, సక్రమంగా నిర్వహించుటలో పీఓలు, ఏపీల పాత్ర ఎంతో కీలకమైనదని రిటర్నింగ్ అధికారి ఎ.చైత్రవర్షిణి అన్నారు. మండలంలోని పాలచర్ల బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో పీఓ, ఏపీఓలకు సోమవారం శిక్షణనిచ్చారు. రాజమహేంద్రవరం పార్లమెంటు, నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు కె.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో సిబ్బంది పాత్ర కీలకమన్నారు. ఒకటికి రెండుసార్లు పునశ్చరణ చేసుకుని, తొందరపాటు లేకుండా విధులను నిర్వర్తించాలని సూచించారు. రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ మొదటి రోజు 260 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ అవకాశాన్ని వినియోగించుకున్నారన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలో రాజానగరంలో 40 మంది, అనపర్తిలో 17 మంది, రాజమహేంద్రవరం సిటీలో 95 మంది, రూరల్‌లో 75 మంది, కొవ్వూరులో 27 మంది, నిడదవోలులో 44 మంది, గోపాలపురంలో 28 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు ఉన్నారన్నారు. 98 మంది వృద్ధులు హోమ్ ఓటింగ్‌ని వినియోగించుకున్నారన్నారు.

సంక్షేమం కొనసాగాలంటే జగనే రావాలి

- ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి
- వేంద్రలో ఎన్నికల ప్రచారం



వేంద్రలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి

పెదపూడి: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి సత్తి ఆదిలక్ష్మి అన్నారు. సోమవారం ఆమె వేంద్ర గ్రామంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో గడప గడపలో మహిళలు ఆమెకు మంగళహారతులిచ్చి, పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి మాట్లాడుతూ చంద్రబాబు మాయ మాటలు, దొంగ హామీలు నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. టీడీపీని నమ్మి ఓట్లు వేస్తే కష్టాలు కొని తెచ్చుకున్నట్లేనన్న విషయం వారికి తెలుసన్నారు. పేదరికమే ప్రామాణికంగా కుల, మత, పార్టీలకు అతీతంగా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. పేదల గుండె చప్పుడుగా మారిని జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామన్నారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ప్రజలు ఫ్యాను గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తన భర్త డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని, ఎంపీగా డాక్టర్ గూడురి శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, అనపర్తి జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతా వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, సర్పంచి కోసూరి వాసు, పోతుల పద్మిణి, మేడపాటి సుశీల, సంధ్య, పి.కల్యాణి, కుమారి, మంగాదేవి, పడాల చంద్రకళ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నర్ల సాంబమూర్తి, పైన పీఏసీఎస్ డైరెక్టర్ పేపకాయల సూర్యనారాయణ, కోసూరి సతీష్, నర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సాయం చేసిన వారికి ఓటు ద్వారా చేయూతనిద్దాం



సీతారామపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న డాక్టర్ రాజశ్రీ

రాజానగరం: పేద ప్రజలను ఆర్థికంగా అభివృద్ధిలోకి తీసుకురావాలనే ఆశయంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గడచిన ఐదేళ్లుగా నవరత్నాలు వంటి వివిధ సంక్షేమ పథకాలను అమలు చేశారని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ రాజశ్రీ అన్నారు. మండలంలోని సీతారామపురం, కోరుకొండ మండలం, గాదరాడలలో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి, ప్రతి ఒక్కరినీ పలుకరిస్తూ ప్రచారం చేశారు. సంక్షేమ పథకాలు మరికొంత కాలం కొనసాగితే రాష్ట్రంలో పేదరికమనేదే ఉండదన్నారు. అయితే ఈ సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, పేదల బాగు కోసం చేసే ప్రయత్నాలు ఫలించాలన్నా ఓటు ద్వారా మీరంతా జగనన్నకు చేయూతనివ్వాలన్నారు. ఈ సార్వత్రిక ఎన్నికలలో మీకిచ్చే రెండు ఓట్లను ఫ్యాను గుర్తుకు వేయడం ద్వారా రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకురావొచ్చన్నారు. ఇది మనందరి బాధ్యతని, ఏ ఒక్కరు మరువరాదన్నారు. సంక్షేమ పథకాలు ఉంటేనే ప్రగతి జరుగుతుందని, ప్రగతి జరిగితేనే రాష్ట్రం అభివృద్ధిలో ముందంజ వేస్తుందన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

అనపర్తి: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు, సిబ్బంది సోమవారం పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. నియోజకవర్గ పరిధిలో మొత్తం 516 మంది పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేయాల్సి ఉండగా 383 మంది పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.మాధురి తెలిపారు.

సెబ్ విస్తృత దాడులు



స్వాధీనం చేసుకున్న సారా, డ్రమ్ములు, అరెస్టు చేసిన నిందితులతో సెబ్ సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆఫీసర్ పిట్టా సోమశేఖర్ ఆదేశాల మేరకు సోమవారం సెబ్ రాజమహేంద్రవరం సౌత్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ సిబ్బందితో కలిసి విస్తృతదాడులు నిర్వహించారు. రాజానగరం మండలం శ్రీరామపురం గ్రామానికి చెందిన ఈరి ధర్మరాజును అదుపులోకి తీసుకుని, 30లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, 600లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేశారు. చక్రద్వారబంధం గ్రామానికి చెందిన గుబ్బల దుర్గారావును అరెస్టు చేసి అతని నుంచి 2.52 లీటర్ల డ్యూటీపెయిడ్ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ, సబ్ ఇన్‌స్పెక్టర్‌లు వై.దుర్గాప్రసాద్, బి.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్క ఓటు కీలకం



కార్యక్రమంలో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పరిశీలిస్తున్న సుబ్రహ్మణ్యం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు వినియోగించుకోవడం మన సామాజిక బాధ్యతని సార్వత్రిక ఎన్నికల సాధారణ పరిశీలకులు కె.సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల ఆవరణలో పీవో, ఏపీవో రెండో శిక్షణ కార్యక్రమంలో భాగంగా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను, ఆర్వో కె.దినేష్ కుమార్, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్‌తో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేసేలా స్వీప్ కార్యకలాపాలను నిర్వహిస్తున్నామన్నారు. పోలింగ్ రోజున ఓటు వేసేందుకు వచ్చే వారికి ఓటు హక్కును కల్పిస్తామన్నారు. పీవో బుక్‌లో పేర్కొన్న విధంగా ఎన్నికల విధులు నిర్వహించే క్రమంలో నిబద్ధతతో ఉండాలన్నారు. మునిసిపల్ కమిషనర్, రాజమండ్రి సిటీ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ శిక్షణకు హాజరైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు

సీతానగరం: స్థానిక కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో శ్రీరామకృష్ణ మఠం, వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరంతోపాటుగా కంటి వైద్యశిబిరాన్ని సోమవారం నిర్వహించారు. సీతానగరం కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో వైద్యులు సత్యం రమేష్‌బాబు, యన్నమనేని రామచంద్రరావు, రాయుడు శ్రీనివాస్ 200 మందికి వైద్య సేవలందించారు.154 మందికి సాధారణ పరీక్షలు చేయగా, 46 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, నలుగురికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వారికి ఉచిత ఆపరేషన్‌ల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల, యన్నమని వెంకట నారాయణ, చంటిబాబు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సుభిక్ష పాలన సాధ్యం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- వడిశలేరు, అనపర్తిల్లో ఎన్నికల ప్రచారం



అనపర్తి నల్లకాలువ ప్రాంతంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



వడిశలేరులో ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డికి ఘన స్వాగతం పలుకుతున్న నాయకులు

రంగంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సుభిక్షమైన పాలన కొనసాగించడం సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. వడిశలేరు, అనపర్తిల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వడిశలేరులో ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు విచ్చేసిన ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పూల జల్లులు, మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ఇంటి ముంగిటకే అందజేస్తున్నారన్నారు. పథకాల అమలులో అన్ని వర్గాలకూ న్యాయం చేశారన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, జెడ్పీకో-ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్, రాష్ట్ర రైతు, చేనేత విభాగాల కార్యదర్శులు రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, పాలాటి నాగేశ్వరరావు, అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ పోతుల బులివీర్రాజు, పార్టీ కన్వీనర్ నలమాటి భీముడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మేనిఫెస్టో ఓ బూటకం

అనపర్తి: అమలు కాని హామీలతో ప్రజలను మరోసారి మోసం చేసేందుకు చంద్రబాబు బూటకపు మేనిఫెస్టోతో ప్రజల ముందుకు వస్తున్నారని, కూటమి నేతలు మాటలు నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం ఆయన స్థానిక పాతవూరు నల్లకాలువ, మసీద్ సెంటర్, బాపనమ్మ గుడి తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల అభ్యున్నతే ధ్యేయంగా గత ఐదేళ్లుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తేనే పార్టీలకు అతీతంగా పేదలకు మేలు జరుగుతుందన్నారు. ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీకి అఖండ విజయాన్ని అందించాలని ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తమ ఇంటి ముంగిటకే విచ్చేసిన ఎమ్మెల్యేకు ప్రజలు ఘనస్వాగతం బ్రహ్మరథం పట్టారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నయనానందకరంగా గ్లో గార్డెన్

- అద్భుతమైన టెక్నాలజీ, లైటింగ్‌తో ఏర్పాటు
- రూ.4.4 కోట్లతో పార్క్ నిర్మాణం
- దేశంలో మూడోది



గ్లో గార్డెన్‌లో నయనానందకరంగా ఏర్పాటు చేసిన లైటింగ్




లైటింగ్‌తో ఏర్పాటు చేసిన జీబ్రా

రాజమహేంద్రవరం సిటీ: అడుగు పెడితే చాలు అద్భుతమైన లోకంలో విహరించినట్లుండే వాతావరణం, సినిమాల్లో మాత్రమే చూసే అందమైన విద్యుత్ వెలుగులు రాజమహేంద్రవరం నగరంలో సాక్షాత్కరించాయి. ఒక్కసారి పార్కులో అడుగు పెడితే చాలు ఆనందం మన సొంతం అను అనుభూతి కలుగుతుంది. ఎంతో మనోరంజికంగా నయనానందకరంగా తయారు చేశారు గ్లో గార్డెన్ పార్కు. రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఆధ్వర్యంలో లాలా చెరువు సమీపంలోని 50వ డివిజన్ గాంధీపురం-4 మున్సిపల్ పార్కులో ఏర్పాటు చేసిన గ్లో గార్డెన్ చిన్నా పెద్దా యువతను ఆకట్టుకుంటోంది. ఈ పార్కులో అద్భుతమైన టెక్నాలజీ, మిరుమిట్లు గొలిపే లైటింగ్‌తో రూ.4.4 కోట్లతో నిర్మించారు. ఇలాంటి పార్కులు గుజరాత్ రాష్ట్రంలో ఒకటి, తెలంగాణలో రెండోది, రాజమహేంద్రవరంలో మూడోది ఏర్పాటు చేశారు.

అంతా విద్యుత్ లైట్లే..

నగరంలో రాత్రి ఆరయితే చాలు అద్భుతమైన అందాల హరివిల్లు పార్కులో కనిపిస్తుంది. రాత్రి 6.30 గంటల నుంచి 10 గంటల వరకూ ప్రజలు సందర్శించవచ్చు. పెద్దలకు రూ.30, పిల్లలకు రూ.20 ప్రవేశ టిక్కెట్‌గా నిర్ణయించారు. వివిధ ఆకారాల్లో ఈ గార్డెన్‌లో పలు రకాల జంతువుల ఆకారాల్లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. జింకలు, ఎలుగుబంట్లు, జిరాఫీలు, జీబ్రాలు, హంసలు, ఫ్లెమింగోలు ఎంతో ఆకట్టుకుంటున్నాయి. సందర్శకులు కూర్చునేందుకు ప్రత్యేక లైటింగ్‌తో సిట్టింగ్ ఏర్పాటు చేశారు. వెదురు పొదలు, చెర్రీ ట్రీస్, ఫామ్ ట్రీస్ అద్భుతంగా ఉన్నాయి. చిన్నారులు ఆడుకునేందుకు సంగీతం, లైటింగ్‌తో వచ్చే పియానో విశేషంగా ఆకట్టుకుంటుంది. దీంతోపాటు 32 డిస్క్ ఏర్పాటు చేశారు. దీన్ని ప్రత్యేకత ఏమిటంటే సందర్శకులు అడుగు తీసి అడుగు వేసే సమయంలో లైటింగ్ వస్తూ పోతూ ఉంటుంది. ఇది మరింత సరదానిస్తోంది. దీపాలతో వెలిగేలా పెద్ద చెట్లు, గ్రాస్ (గడ్డి) ఏర్పాటు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



కనువిందు చేస్తున్న జింకలు



లైటింగ్‌తో ఏర్పాటు చేసిన గ్రాస్

పురందేశ్వరి ఆరోపణలు నిరూపిస్తారా?

కమీషన్ల ఆరోపణపై ఎంపీ భరత్ సవాల్

రాజమహేంద్రవరం సిటీ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి నోటికొచ్చినట్టు నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదని, నేను 25 శాతం కమీషన్ ఎక్కడైనా తీసుకున్నట్టు నిరూపించాలని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎవరో రాసిచ్చినవి చదవడం కాదని, అవి ఎంత వరకూ వాస్తవమో నగరంలో విచారణ చేసుకోకుండా ఇష్టం వచ్చినట్టు విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. అభివృద్ధి పనులు ఒక వైపు జరగలేదని చెప్పేదీ మీ కూటమి నాయకులేనని, మరో వైపు అభివృద్ధి పనుల్లో 25 శాతం కమీషన్లు తీసుకున్నానని నిబద్ధతలేని ఆరోపణలు చేస్తున్నారన్నారు. కమీషన్లు తీసుకునే సంస్కృతి, కక్కుర్తి మీ కూటమిలో టీడీపీకే ఎక్కువ అలవాటని ఆరోపించారు. టీడీపీ నేతలు ఆదిరెడ్డి కుటుంబానికి కమీషన్లే ఊపిరి అని, కమీషన్లే ఆహారం బతుకుతున్నారన్నారు. రాజకీయాలు నడిపేది, అధికారం కోసం వెంపర్లాడేది ఆ కమీషన్ల కోసమే అన్నారు. నగరాన్ని అభివృద్ధి చేయాలనే చిత్తశుద్ధితో నిస్వార్థంగా కృషి చేస్తున్న నాపై ఏ ఆధారంతో ఆరోపణలు చేశారో స్పష్టత ఇవ్వాలని ఎంపీ భరత్ డిమాండ్ చేశారు. మీ మరిది కళ్లలో ఆనందం కోసం పోటీ చేస్తున్నారు. నిరాధార ఆరోపణలు చేస్తే దానికి తగిన మూల్యం తప్పక చెల్లించవలసి వస్తుందని ఎంపీ భరత్‌రామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నేను ఎంపీగా చేసిన అభివృద్ధికీ చాలెంజ్ చేస్తా బహిరంగ చర్చకు సిద్ధం కావాలని పురందేశ్వరికి ఎంపీ భరత్‌రామ్ సవాల్ విసిరారు.